క్లుప్తంగా

పీఆర్టీయూ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



పదవీప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

మామిడికుదురు: మామిడికుదురులో జరిగిన పీఆర్టీయూ కోనసీమ జిల్లా సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికతో పాటు మామిడికుదురు మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక కూడా ఏకగ్రీవంగా జరిగిందని సోమవారం సంఘం ప్రతినిధులు తెలిపారు. జిల్లా ప్రెసిడెంట్‌గా నరాల కృష్ణకుమార్, జనరల్ సెక్రటరీగా దీపాటి సురేష్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మొంగం అమృతరావు, స్టేట్ సెక్రటరీగా కంకటాల చంద్రశేఖర్, స్టేట్ కౌన్సిలర్లుగా పంగం బ్రహ్మజీ, వైవీ సత్యనారాయణ ఎన్నికయ్యారని తెలిపారు. మండల శాఖ గౌరవాధ్యక్షుడిగా పొన్నపల్లి వెంకటేశ్వరరావు, అధ్యక్షుడిగా యాళ్ల పళ్లంరాజు, ప్రధాన కార్యదర్శిగా చింతా రమేష్, ఆర్థిక కార్యదర్శిగా పెచ్చెట్టి నరసింహమూర్తి, జిల్లా కౌన్సిలర్‌గా కేవీడీ ప్రసాద్, మట్టా శ్రీనివాసరావు, మాగాపు విజయదుర్గారావు, ముత్యాల వీఆర్ నాయుడు ఎన్నికయ్యారు.

ఘనంగా అన్నాభిషేకం

ఆలమూరు: దక్షిణ భారతదేశంలోనే ఏకైక ఆలయంగా ప్రఖ్యాతి చెందిన ఆలమూరు పార్వతీ సమేత విక్రమ భట్టీశ్వరస్వామి సోమవారం నిర్వహించిన ఏకాదశ వార అన్నాభిషేకం, రుద్రాభిషేకం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. గ్రామస్తులు, దాతల సహకారంతో దేవదాయ శాఖ పర్యవేక్షణలో ప్రముఖ శైవాగమ పండితులు, టీటీడీ వార్షిక సన్మాన గ్రహీత, బ్రహ్మశ్రీ కాళ్ళకూరి సూరిపండు ఆధ్వర్యంలో అర్చక బృంద సభ్యులు వెలవలపల్లి చైతన్య కృష్ణ, కాలదారి కార్తికేయ, కాళ్ళకూరి నరేంద్ర శర్మ, సత్యవోలు సుబ్రహ్మణ్యం తదితర పండితుల చేతుల మీదుగా ఈ అన్నాభిషేకాన్ని తిలకించడానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ఆవరణలో భారీ అన్నదానం నిర్వహించారు. కొత్తపేట జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, పారిశ్రామికవేత్త వంటిపల్లి పాపారావు తదితర నేతలు స్వామి వారి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. షేక్ ఖాసిం, యేరుకొండ విశ్వేశ్వరరావు, శిరిగినీడి వీరబాబు, చల్లా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కిక్ బాక్సింగ్ పోటీలు

రాజోలు: ఆది కవి నన్నయ యూనివర్శిటీ ఇంటర్ కొలిగేట్ టోర్నమెంట్ కిక్ బాక్సింగ్ పోటీలు ఈ నెల 17, 18వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సాయిబాబు సోమవారం తెలిపారు. ఈ పోటీల్లో యూనివర్శిటీ పరిధిలోని కళాశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, ఆర్గనైజర్ బి.మధుకుమార్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి నల్లి రాజు పర్యవేక్షణలో పోటీలు జరుగుతాయన్నారు.

నేడు సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

అంబాజీపేట: గ్రామ పంచాయతీల్లో ఆర్‌జీఎస్ఏ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా సుస్థిరమైన స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ కార్యక్రమాన్ని అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళ, బుధవారంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జి.సరోవర్ తెలిపారు. ఈ శిక్షణను పంచాయతీ సర్పంచ్‌లకు, కార్యదర్శులకు, సచివాలయ ఫంక్షనరీలకు ఇవ్వనున్నామన్నారు. ఈ శిక్షణకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు.

నేడు రాజోలు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ఎన్నిక

రాజోలు: రాజోలు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఈ నెల 17న రాజోలు మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని తహసీల్దార్ ఎస్ఎస్ఎస్ ప్రసాద్ సోమవారం తెలిపారు. ఈ ఎన్నికలో రాజోలు, మలికిపురం, లక్కవరం, రామరాజులంక, సఖినేటిపల్లి, గొంది, అంతర్వేది నీటి వినియోగదారుల సంఘ అధ్యక్షులు మాత్రమే ఓటు వేసేందుకు అర్హులన్నారు. ఎన్నికల అధికారి డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ శివశంకర్ ప్రసాద్ ఆధ్వర్యంలో రాజోలు డీసీ కమిటీ ఎన్నిక జరుగుతుందన్నారు.

సహజ కవి వెంకట్‌కు సన్మానం



సహజకవి వెంకట్‌ను సన్మానిస్తున్న ప్రతాప్

అంబాజీపేట: కర్నూలు జిల్లా మంత్రాలయంలో ఈ నెల 15వ తేదీన పరిమళ విద్యానికేతన్ కళాశాల ప్రాంగణంలో అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీకళావేదిక ఆధ్వర్యంలో 142వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో స్థానిక సహజ కవి పాలమూరి వెంకట్‌ను ఘనంగా సత్కరించారు. దేవుడా ఏమిటీ మాయ అనే కవితా గానం చేసినందుకు వెంకట్‌ను సన్మానించారు. కళాకారుల సమక్షంలో కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ వెంకట్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కొల్లి రామావతి, జి.ఈశ్వరి, టి.పార్థసారధి పాల్గొన్నారు.

నవ పారిజాతం.. జనార్దనుని అనుగ్రహం

- గోదావరి తీరాన కొలువైన నవ జనార్దనులు
- ధనుర్మాసం నెల రోజులూ స్వాముల దర్శనానికి భక్తుల క్యూ
- దేశంలోనే ప్రత్యేకత సంతరించుకున్న ఆలయాలు

ఆలమూరు: విశ్వమే విష్ణు స్వరూపంగా, కోరిన కోర్కెలు తీర్చే కల్పతరువుగా, అభాగ్యుల పాలిట ఆత్మబంధువుగా అనాథ రక్షకుడైన శ్రీమహా విష్ణువు దశావతారాలు ఎత్తి యావత్ భారతావనికి రక్షోపదేశకుడిగా కొనసాగుతూ భక్తుల ఇలవేల్పుగా భాసిల్లుతున్నాడు. గౌతమీ గోదావరి తీరంలో శ్రీమహా విష్ణువు రూపంలో కొలువై ఉన్న నవ జనార్దనస్వామి ఆలయాలు సంక్రాంతి ముగిసే వరకూ దేశ వ్యాప్తంగా విచ్చేసే భక్తులతో సందడి చేయనున్న జనార్దనస్వామి ఆలయాలు. ధనుర్మాసంలో నవ జనార్దనస్వాములను దర్శించుకుంటే నవ దోషాలు హరిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసంగా ఉంది. కార్తికమాసంలో త్రినేత్రుణ్ణి దర్శించుకుని భక్తి పారవశ్యం పొందిన భక్తులు ధనుర్మాసంలో శ్రీవిష్ణువును పూజించనున్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వెంబడి ప్రవహించే గౌతమీ గోదావరి చెంతన ఉన్న ఈ నవజనార్దనులను ధనుర్మాసంలో దర్శించుకుంటే సకల పాపాలు తొలగి నవగ్రహ దోషాలు హరిస్తాయని భక్తుల నమ్మకం కావడంతో దేశ వ్యాప్తంగా టూరిస్టులు ఈ నవ దేవాలయాలను దర్శించుకోవడం ఏటా పరిపాటిగా మారింది. భారతదేశంలో సాధారణంగా నవగ్రహ ఆలయాలు, శైవ క్షేత్రాల్లో మాత్రమే ఉంటాయి. అందులో భక్తులు నవగ్రహ శాంతి పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అయితే ఈ నవ జనార్దనస్వామి ఆలయాల్లో మాత్రం నవగ్రహ పూజలు జరుగుతాయి. దీంతో వైష్ణవ భక్తులందరూ ఈ ధనుర్మాసంలో నవ జనార్దనుని ఆలయాలను దర్శించుకుని ముక్తిని ప్రసాదించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని పలు ప్రసిద్ధమైన, ప్రత్యేకత సంతరించుకున్న వైష్ణవాలయాల్లో సోమవారం నెలవంక కనబడిన వేకువ జాము నుంచే ధనుర్మాసం పూజలకు అంకురార్పణ జరిగింది. ఆయా ఆలయాల్లోని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ పురోహితుల బృందం సమీప గోదావరి తీరం నుంచి జలాలను తీసుకువచ్చి అభిషేకం చేసి ఈ ధనుర్మాస ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అత్యంత భక్తిశ్రద్ధలతో నియమనిష్టలతో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

స్వయంభువుగా భాసిల్లుతున్న జనార్దన ఆలయాలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నెలకొన్న నవ జనార్దనస్వామి ఆలయాలు స్వయంభువుగా భాసిల్లుతున్నాయి. సోమకాసురుడనే రాక్షసుడు చతుర్వేదాలను నాశనం చేసే క్రమం నుంచి రక్షించాలన్న దేవతల కోరిక మేరకు బ్రహ్మదేవుడు శ్రీమహావిష్ణువును వేడుకుంటాడు. క్షీరసాగరం నుంచి శ్రీమహావిష్ణువు భూమిపైకి వచ్చి రాక్షసుణ్ణి సంహరించి వేదాలను రక్షిస్తాడు. అదే సమయంలో నారద మహాముని ఆకాశం నుంచి భువికి తపస్సు చేసుకునేందుకు వస్తాడు. నవగ్రహాల ప్రభావంతో జనులు కష్టాలు పడుతున్నారని గుర్తించిన నారద మహాముని వైకుంఠం వెళ్లి శ్రీమహావిష్ణువుకు వివరిస్తాడు. జనులను కష్టాల నుంచి విముక్తులను చేయాలని వేడుకుంటాడు. అందులో భాగంగానే శ్రీమహావిష్ణువు ప్రజల రక్షణార్థం గౌతమీ గోదావరి తీరం వెంబడి తొమ్మిది ప్రదేశాల్లో స్వయంభువుగా వెలిశాడని పురాణ పండితులు చెబుతున్నారు. స్వయంభువుగా వెలసిన విగ్రహాల వద్ద నారద మహాముని ఆలయాలను నిర్మించాడని పురాణ, ఇతిహాసాలు చెబుతున్నాయి. ధనుర్మాసంలో నవ జనార్దనాలయాలను సందర్శించి పూజలు చేస్తే నవ దోషాలు పూర్తిగా హరిస్తాయని భక్తులు ప్రగాఢ విశ్వాసంగా ఉండటంతో ఏటా వేలాది మంది భక్తులు ఈ నవ జనార్దనస్వామి ఆలయాలను దర్శించుకుని భక్తి పారవశ్యం పొందుతుంటారు.

ముద్రల రూపంలో జనార్దనస్వామి దర్శనం

గౌతమీ గోదావరి తీరం వెంబడి ఉన్న శ్రీనవ జనార్దన స్వామి ఆలయాల్లో శ్రీమహావిష్ణువు ముద్రల రూపంలో భక్తులకు దర్శనమిస్తాడు. నవ జనార్దనస్వామి ఆలయాలు మాత్రం ఒక్కొక్కటి ఒక్కో విధంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని ధవళేశ్వరంలో జనార్దనస్వామి యోగ ముద్రలోను, ఆలమూరు మండలం మడికిలో సుదర్శన ముద్రలో, జొన్నాడలో అభయ ముద్రలో, ఆలమూరులో ఉగ్ర అభయ ముద్రలోను, మండపేటలో భోగముద్రలోను, కపిలేశ్వరపురంలో పద్మాసన ముద్రలో, మాచరలో జ్వాలాముద్రలో, కోరుమిల్లిలో సాధక ముద్రలో, కోటిపల్లిలో సిద్ధముద్రలోను స్వామివారు కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తారు.

ప్రథమం: ధవళేశ్వరం యోగ ముద్రలో..



నవ జనార్దనస్వామి ఆలయాల్లో ప్రథమమైన ధవళేశ్వరంలో బ్రహ్మచారిగా బాసిల్లుతున్న జనార్దన స్వామి యోగముద్రలో దర్శనమిస్తాడు. ఉగ్రరూపంలో ఉన్న జనార్దనుని శాంతింపజేయాలన్న భక్తుల సంకల్పం మేరకు ఆలయంలో మహాలక్ష్మి దేవిని ప్రతిష్ఠించారని ప్రతీతి. భీష్మఏకాదశి రోజున నిర్వహించే రథోత్సవం ప్రత్యేకత సంతరించుకుంటుంది.

ద్వితీయం: సుదర్శన ముద్రలో..



216 ఏ జాతీయ రహదారిలోని మడికిలో ద్వితీయంగా వెలసిన జనార్దనస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయంలో జనార్దనస్వామి సుదర్శన ముద్రలో భక్తులకు దర్శనమిస్తాడు. తూర్పుముఖంగా వెలసిన ఈ ఆలయంలో ప్రతిష్ఠించబడ్డ విగ్రహం పాదాలకు ప్రాతఃకాలంలో సూర్యకిరణాలు ప్రతి రోజూ తాకుతుండటం విశేషంగా చెబుతారు.

తృతీయం: అభయముద్రలో..



గౌతమీ గోదావరికి కూతవేటు దూరంలో వెలసిన జనార్దనస్వామి అభయముద్ర రూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పతరువుగా ఈ జనార్దనస్వామిని కొలుస్తారు. సమీపంలోని గోదావరిలో పుణ్యస్నానమాచరించి దేవతామూర్తులకు దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుంది.

చతుర్థం: ఉగ్రముద్రలక్ష..



జొన్నాడ నుంచి మండపేట వెళ్లే రహదారిలోని ఆలమూరులో జనార్దనస్వామి ఆలయం ఉంది. భారీ శిల్ప సంపదతో అలరారుతున్న ఈ ఆలయంలో జనార్దనస్వామి ఉగ్ర రూపంలో భక్తులకు దర్శనమిస్తాడు. రథ సప్తమి రోజున భారీగా రథోత్సవం నిర్వహిస్తారు.

పంచమి: భోగ ముద్రలో..



మండపేటలో వేంచేసిన జనార్దనస్వామి భోగ ముద్రలో భక్తులకు దర్శనమిస్తారు. కపిలేశ్వరపురం మండలంలోని ధాతపురిగా ప్రఖ్యాతిగాంచిన తాతపూడిలోని గోదావరి చెంతన తొలుత ఈ ఆలయం ఉండేది. పూర్వం సంభవించిన వరదల వల్ల దేవాలయం పూర్తిగా కొట్టుకుపోతుండటంతో అప్పటి వేద పండితుల సలహా మేరకు మాండవ్యపురం (మండపేట)కు ఆ విగ్రహాన్ని తీసుకువచ్చారని పూర్వీకులు చెబుతుంటారు. ఈ ఆలయంలో జనార్దనుడితో పాటు అగస్త్యేశ్వర, కైలేసేశ్వర దేవాలయాలు ఉండటం ప్రత్యేకతగా భావిస్తారు.

కపిలేశ్వరపురంలో పద్మాసన ముద్రలో..



పూర్వం ఇక్కడ జనార్దనస్వామి ఆలయం రాజ్యకాంక్ష కోసం దోపిడీకి గురైంది. దీంతో అప్పటి పాలకుల సహకారంతో అర్చకులు జనార్దనస్వామి విగ్రహాన్ని భూమిలో భద్రపరచారు. కొన్నేళ్ల కిందట ఈవిగ్రహం బయట పడటంతో ఆలయాన్ని భక్తులు పునర్నిర్మించారు. ఈ ఆలయంలో జనార్దనుడు పద్మాసన ముద్రలో దర్శనమిస్తాడు.

సప్తమం: జ్వాలాముద్రలో



నవ జనార్దన ఆలయాల్లో సప్తమ క్షేత్రంగా బాసిల్లుతున్న ఆలయంలో జనార్దన స్వామి జ్వాలాముద్రలో భక్తులకు దర్శనమిస్తాడు. రథ చక్రాకృతిలో ఉన్న ఈ ఆలయం పైకి చిన్నగా కనిపిస్తున్నా భక్తులను మాత్రం విశేషంగా ఆకట్టుకుంది.

అష్టమం: సాధక ముద్రలో..



గౌతమీ గోదావరి చెంతన అష్టమ క్షేత్రంగా విరాజిల్లుతున్న పెదకోరుమిల్లిలోని జనార్దనస్వామి సాధక ముద్రలో భక్తులకు దర్శనమిస్తాడు. పురాతన ఆలయంగా బాసిల్లుతున్న ఈ ఆలయానికి భక్తి పరమైన ప్రాశస్త్యం నెలకొని ఉంది.

నవమ క్షేత్రం: సిద్ధముద్రలో ..



భారతదేశంలోనే మరెక్కడా లేని విధంగా గోదావరి నదీ తీరాన వైష్ణ, శైవ క్షేత్రాలు ఒకే శిఖరం కింద, ఒకే ధ్వజ స్తంభంతో వేర్వేరు గర్భ గుడుల్లో ఉన్నాయి. అందులో కొలువైన జనార్దన స్వామి, ఛాయా సోమేశ్వరస్వామిని దర్శించుంటే సకల పాపహరణం జరుగుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకంగా ఉంది.

అమ్మవార్లకు భవానీల సారె సమర్పణ

అంబాజీపేట: మాచవరంలో వేంచేసిన ఇటికాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు గురు భవానీలు దంగేటి సాయిబాబు, మల్లేశ్వరి దంపతులు, గురుభవాని మట్టపర్తి దుర్గారావు (ఏసు), గురుభవాని మట్టపర్తి దుర్గాప్రసాద్‌ల ఆధ్వర్యంలో సోమవారం సారె సమర్పించారు. పోతాయిలంక భక్తాంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి భవానీలు, గ్రామ ఆడపడుచులు కలసి అమ్మవార్లకు బోనం, చలివిడి పానకాలు, పసుపు కుంకుమలు, చీరలు, స్వీట్లు, బూరెలు, గారెలతో మేళతాళాలు, జైదుర్గా, జైజై దుర్గా శరణుఘోష నడుమ భారీ ర్యాలీగా తరలి వెళ్లారు. అనంతరం అంబాజీపేట భవానీ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భిక్షలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ముత్యం, కోలా దొరబాబు, సూర్యకుమారి మాతాభవాని, కేతా దొరబాబు, మట్టపర్తి శ్రీనివాస్, సుబ్బారెడ్డి, యంత్ర శ్రీను, పాటి శేఖర్ గురుభవానీలు పాల్గొన్నారు. ఇటికాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లను ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ విత్తనాల దుర్గాభవాని, ఇంద్రశేఖర్, సొసైటీ మాజీ అధ్యక్షులు దొమ్మేటి సత్యమోహన్, చింతపల్లి వెంకటేశ్వరరావులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



మాచవరంలో సారెతో వెళుతున్న గురుభవానీలు, భక్తులు

ఇసుక సరఫరా చేయడం లేదంటూ ధర్నా

మామిడికుదురు: పెదపట్నం ఇసుక రీచ్ నుంచి నగరం గ్రామానికి ఇసుక సరఫరా చేయడం లేదంటూ స్థానికులు సోమవారం మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. పెదపట్నం ఇసుక రీచ్‌లో కొందరు నేతలు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, ఇసుక దొరక్క తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. పెదపట్నం ఇసుక రీచ్‌ను ప్రారంభించి రెండు నెలలు కావస్తుందన్నారు. అత్యవసర పనులకు, గ్రామస్తుల అవసరాల మేరకు ఇంత వరకు ఇసుక అడగలేదన్నారు. రెండు నెలల తర్వాత కూడా ఇసుక ఇవ్వడం లేదన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతు తహసీల్దార్ వైవీ సుబ్రహ్మణ్యం ఆచార్యులుకు ఫిర్యాదు చేశారు. ఇతర రీచ్‌లలో ఇసుక ఇతర గ్రామాలకు ఇస్తున్నారని, కానీ రవాణా ఖర్చులు భారీగా ఉన్నాయన్నారు. తమ సరిహద్దు గ్రామమైన పెదపట్నం నుంచి ఇసుక అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నాలో వి.శ్రీనివాస్, పి.నాగబాబు, తాటికాయల ఉదయభాస్కర్, ఎం.గోపీచందు తదితరులు ఉన్నారు. దీనిపై పరిశీలన చేసి ఇసుక అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న నగరం గ్రామస్తులు

మొక్కలు, చెట్ల నిర్వహణను బాధ్యతగా తీసుకోవాలి

అంబాజీపేట: మొక్కలతో పాటు చెట్లను సంపూర్ణ ఆరోగ్యం కోసం రైతులు వాటి నిర్వహణకు బాధ్యతగా భావించడం వల్ల మంచి ఫలితాలు పొందుతారని నేషనల్ ప్లాంట్ హెల్త్ మేనేజ్మెంట్ (ఎన్‌పీహెచ్‌ఎం) అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీలక్ష్మి సూచించారు. అంబాజీపేటలోని కృషివల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ కార్యాలయంలో చైర్మన్ గణపతి వీరరాఘవులు అధ్యక్షతన మొక్కల ఆరోగ్య నిర్వహణ అంశంపై రైతులకు సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. డాక్టర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ వివిధ రకాల్లో పండిస్తున్న మొక్కలను సంరక్షిస్తే సంపూర్ణ ఆరోగ్యకరమైన పంటలను ఉత్పత్తి చేయవచ్చన్నారు. జిల్లాలో విస్తరించి ఉన్న కొబ్బరి పంటకు సోకే వివిధ రకాల తెగుళ్లు, పురుగులకు క్షేత్రస్థాయిలో చర్యలను రైతులు చేపడితే చాలా వరకు నష్ట నివారణ చేయవచ్చన్నారు. కొబ్బరిలో వేరు, కొమ్ము పురుగుల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. బయోకంట్రోలు, నేట్ తదితర వినియోగాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని తద్వారా వాటిని క్షేత్రస్థాయిలో అమలు పరిస్తే ఫలితాలు ఉంటాయన్నారు. కొబ్బరి పంటలో రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి రైతులు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. భూమిలో సేంద్రియ కర్బనం ప్రభావంపై రైతులకు తెలియజేశారు. ఎన్‌పీహెచ్‌ఎం సభ్యుడు ముత్యాల జమ్మీలు, శాస్త్రవేత్త డాక్టర్ శైలజ, కృషివల సంస్థ ప్రతినిధులు అడ్డాల గోపాలకృష్ణ, యాళ్ల వెంకటానందం, బొక్కా ఆదినారాయణ, గోదశి నాగేశ్వరరావు, కాకినాడ ఏడీఏ రత్నప్రశాంతి, హెచ్‌వో శైలజ, చిన్నం బాలవిజయరావు, ఉప్పుగంటి భాస్కరరావు పాల్గొన్నారు.



అంబాజీపేటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎన్‌పీహెచ్‌ఎం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీలక్ష్మి

కర్నూలులో శతాధిక కవి సమ్మేళనం

సఖినేటిపల్లి: కర్నూలు జిల్లా మంత్రాలయంలో ఆదివారం శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో సదరు జిల్లా కార్యవర్గం కవితోత్సవం పేరిట జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహించారు. వివరాలు సోమవారం ప్రతాప్ మీడియాకు తెలిపారు. మంత్రాలయంలో పరిమళ విద్యానికేతన్‌లో కవులతో పై సమ్మేళనం ఏర్పాటు చేశారు. తెలుగు సాహిత్యం, తెలుగు భాష, తెలుగు సంస్కృతి, తెలుగు వైభవం వంటి అంశాలపై నిర్వహించిన సుదీర్ఘ కవి సమ్మేళనం ఆహూతులను ఓలలాడించింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రతాప్‌ను కర్నూలు జిల్లా సాహిత్యవేత్తలు, కవులు గజమాలతో సత్కరించి, మెమెంటో బహూకరించారు. అంతర్జాతీయంగా ప్రతాప్ సాహిత్య సేవలను ప్రశంసిస్తూ కవితోత్సవంలో వక్తలు మాట్లాడారు. వేదిక కార్యవర్గ సభ్యులు నాగజ్యోతి మలేకర్, సువర్ణ జోషి, కేశవయ్య, సిద్ధార్థ, ప్రకాష్, శేఖర్, వెంకటేశ్వరయ్య, డాక్టర్ ఉమాదేవి పాల్గొన్నారు.

అమృతలింగేశ్వరునికి చెరకు రసంతో అభిషేకం

మామిడికుదురు: వైనతేయ గోదావరి నదీతీరం అప్పనపల్లి స్నానఘట్టం వద్ద కొలువైన ఉమా అమృతలింగేశ్వరునికి సోమవారం 108 లీటర్ల చెరకు రసం, 108 బిందెల గోదావరి నదీ జలాలతో వైభవంగా అభిషేకం జరిపించారు. మార్గశిర మాసం, ఆరుద్ర నక్షత్రం, పరమ శివుడు ఉద్భవించిన రోజు కావడంతో శివకేశవ భక్త బృందం ఆధ్వర్యంలో ఈ పూజల్ని వైభవంగా జరిపించారు. విశేష సంఖ్యలో భక్తులు ఈ పూజలో పాల్గొన్నారు. అమృతలింగేశ్వరుడిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. 2005 నుంచి ఏటా శివుడు ఉద్భవించిన రోజును అప్పనపల్లిలో శివకేశవ భక్త బృందం ఘనంగా నిర్వహిస్తోంది. దీంతో పాటు మామిడికుదురు పార్వతీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో శివుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలను ఘనంగా జరిపించారు. దీంతో పాటు మండలంలోని పలు శివాలయాల్లో జరిగిన ఆరుద్ర నక్షతం పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా ఆర్ద్రాభిషేకం

ఆలమూరు: మండలంలోని పెదపళ్లలో సోమవారం పార్వతీ రామలింగేశ్వరస్వామికి ఆర్ద్రాభిషేకం జరిగింది. శివ ముక్కోటి పర్వదినం సందర్భంగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ అర్చకులు అంగరంగ వైభవంగా ఈ ఆర్ద్రాభిషేకం నిర్వహించారు. మార్గశిర మాసంలో ఆరుద్ర నక్షత్రం ఉన్న రోజును శివ ముక్కోటిగా పిలవడం ఆనవాయితీగా వస్తుంది. రామలింగేశ్వరస్వామికి అష్టోత్తర పూజ, పార్వతి అమ్మవారికి కుంకుమ పూజ జరిగింది. శాంతి, సౌభాగ్యాలను ప్రసాదించాలని కోరుతూ ఏటా ఈ ఆర్ద్రాభిషేకం నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ తెలిపింది. ఈ కార్యక్రమానికి పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి దేవతామూర్తులను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



అప్పనపల్లిలో అమృతలింగేశ్వరునికి చెరుకు రసంతో అభిషేకం



పెదపళ్లలో పార్వతీ రామలింగేశ్వరస్వామికి ఆర్ద్రాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

జూనియర్ కళాశాల భవనం నిర్మించాలి

ఆలమూరు: శిథిలావస్థకు చేరిన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని పునర్నిర్మించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య డిమాండ్ చేసింది. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం కళాశాల ఎదుట విద్యార్థులు భారీ స్థాయిలో ధర్నా చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు వెంకట్ మాట్లాడుతూ కళాశాల కళావిహీనంగా ఉండటంతో పాటు అధ్యాపకుల కొరత వేధిస్తుండటతో ఏటా ప్రవేశాలు తగ్గుతూ వస్తున్నాయన్నారు. రెండు మండలాల్లోని 12 గ్రామాల పేద మధ్య తరగతి విద్యార్థులకు అందుబాటులో ఉన్న ఈ ప్రభుత్వ కళాశాలను కాపాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అలాగే పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉచిత విద్య కల్పించే ప్రభుత్వ విద్యాలయాలు అభివృద్ధి చేయకపోవడం వల్ల విద్యార్థులు అప్పులు చేసి ప్రైవేట్ కళాశాలల వైపు మొగ్గు చూపుతున్నారని విమర్శించారు. ఇకనైనా కళాశాల యాజమాన్య, రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే స్పందించి మౌలిక సదుపాయాలతో కూడిన కళాశాల భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. జిల్లా సమితి సభ్యులు చిరు, ఉదయ్, వినయ్, లావణ్య, మరియు వందలాది విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆలమూరు జూనియర్ కళాశాల వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు

పాలేరు నాటకంతో పేద దళితుల్లో చైతన్యం



మామిడికుదురులో భీమన్నకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వేమా

మామిడికుదురు: మహాకవి, పద్మభూషణ్, డాక్టర్ బోయి భీమన్న పద్యం, గద్యం, వచనం, సాహిత్య రచనలతో సమాజంలో ఉన్న రుగ్మతలపై పోరాటం చేశారని మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా కొనియాడారు. భీమన్న వర్ధంతి సందర్భంగా మామిడికుదురు బోయి భీమన్న మానవ వనరుల కేంద్రంలోని భీమన్న కాంస్య విగ్రహానికి వేమా సోమవారం పూలమాల వేసి నివాళులర్పించారు. 'గుడిసెలు కాలిపోతున్నాయి' కవిత ద్వారా పద్మభూషణ్ అవార్డు అందుకున్న మహనీయుడని కీర్తించారు. పేద దళిత కుటుంబాల్లో పాలేరు నాటకం ద్వారా చైతన్యం తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో గెయిల్ స్కిల్స్ మేనేజర్ సురేష్, సిబ్బంది సత్యనారాయణ, గంటి చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

ఆలమూరు: మండలంలో అర్హులైన లబ్ధిదారులు అందరికీ సంక్షేమ పథకాలను అందజేయడంతో పాటు రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం ఈ సదస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో కె.నాగేశ్వరరావు, తహసీల్దార్ కేజే ప్రకాష్ బాబు అన్నారు. ఆలమూరు మండలంలోని చింతలూరులో సోమ వారం రెవెన్యూ సదస్సు ఏర్పాటు జరిగింది. సర్పంచ్ మార్గని కరుణ అధ్యక్షతన స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన పై అధికారులు పాల్గొని కక్షిదారుల నుంచి అర్జీలు సేకరించారు. నిర్ణీత సమయంలో దరఖాస్తులను పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని గ్రామస్తులకు వారు హామీ ఇచ్చారు. అలాగే సంక్షేమ పథకాల కోసం అందిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు నివేదించి మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు.

ధనుర్మాస పూజలు ప్రారంభం

అయినవిల్లి: మండలం ముక్తేశ్వరంలోని ముక్తికాంత క్షణముక్తేశ్వరస్వామివారి ఆలయంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామివారి ఆలయంలో సోమవారం ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి.. దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు అంగర సాయిపవన్, ఆచార్యుల పర్యవేక్షణలో తెల్లవారుజామున స్వామికి పంచామృతాభిషేకం, తులసిపూజ, లక్ష చామంతి పూజ వంటి విశేష క్రతువులు నిర్వహించారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో కొలువైన శ్రీ, భూ సమేత కేశవస్వామివారి ఆలయంలో సమీప పంట కాలువ నుంచి మంగళ వాయిద్యాల నడుమ తీర్థపు బిందెతో పవిత్ర జలాలు తీసుకొచ్చి స్వామిని అభిషేకించారు. అలాగే స్వామికి బాలభోగం సమర్పించారు

గోదాదేవికి ప్రత్యేక పూజలు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ధనుర్మాసం తొలిరోజు సోమవారం సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి విశేష అభిషేకాలు, పూజలు జరిపారు. అమ్మవారికి వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అమ్మవారి పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



గోదాదేవికి నిర్వహిస్తున్న పూజలు



పుష్పాలంకరణలో శ్రీ, భూ సమేత కేశవస్వామి